క్లుప్తంగా

ముగిసిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు

శావల్యాపురం: జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా రామా పబ్లిక్ స్కూల్లో రెండు రోజుల నుంచి జరుగుతున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమం శనివారంతో ముగిసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కె.రత్నకుమారి తెలిపారు. ఈసందర్భంగా చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు వలేటి శివకృష్ణ పాల్గొని మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే విజ్ఞాన శాస్త్ర భావనలు, విశ్లేషణాత్మక నైపుణ్యాలను ఉపాధ్యాయులు బోధించాలన్నారు. అనంతరం ఉత్తమ నమూనాలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చందు, డైరెక్టరు అజిత్ చందు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ఆరో తరగతి ప్రవేశానికి ఆహ్వానం

నాదెండ్ల: చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ ఝాన్సీవాణి తెలిపారు. ఐదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో మార్చి 31లోగా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఓసీ, బీసీలకు పరీక్ష ఫీజు రూ.150లు కాగా, ఎస్సీ ఎస్టీ విద్యార్థులు రూ.75 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. విద్యార్థులు దగ్గర్లోని మీసేవ కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా గానీ పాఠశాలలో నేరుగా గానీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

మహాశివరాత్రికి ఆర్టీసీ ఆదాయం రూ.17 లక్షలు

వినుకొండ: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ, మన్నేపల్లి, త్రిపురాంతకం, శ్రీశైలానికి వినుకొండ ఆర్టీసీ డిపో నుంచి సుమారు 71 బస్సులు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా సుమారు రూ.17 లక్షల ఆదాయం డిపోకు వచ్చినట్లు ఆర్టీసీ ఇన్చార్జి డిపో మేనేజర్ కోటేశ్వరనాయక్ తెలిపారు.

కృష్ణవేణి అటానమస్ ఫస్ట్ సెమ్ ఫలితాలు విడుదల



నరసరావుపేట ఈస్ట్: కృష్ణవేణి డిగ్రీ కళాశాల (అటానమస్) మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో 78 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ప్రథమ బిఎస్సీ, బికాం (కంప్యూటర్స్) ఫలితాలు విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎంఆర్‌కే సతీష్‌బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ డి.యోగేశ్వరరావు, ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ శ్రీకాంత్, అడిషనల్ కంట్రోలర్ ఎం.సురేష్ పాల్గొన్నారు.

టౌన్ హాలులో మాదిగ అమరవీరుల సంస్మరణ దినం

నరసరావుపేట: స్థానిక టౌన్ హాలులో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చిరుగూరి నాగరాజు మాదిగ ఆధ్వర్యంలో శనివారం మాదిగ అమరవీరుల దినం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు అద్దంకి బాబు మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షులు కనుమూరి కోటేశ్వరరావు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఎస్సీ వర్గీకరణ పోరులో తమ ప్రాణాలను అర్పించిన వారికి నివాళులు అర్పించారు. జిల్లా అధికార ప్రతినిధి కొడవటి అశోక్, చిలకలూరిపేట ఇన్‌చార్జి కొండెపోగు క్రాంతి మాదిగ, రొంపిచర్ల మండల ఎంఎస్‌పీ ఇన్‌చార్జి పుట్టయ్య మాదిగ, ముప్పాళ్ల మండల ఇన్‌చార్జి కందుల అంబేద్కర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో నేటి నుంచి ఉపాధి పనుల సామాజిక తనిఖీ

బొల్లాపల్లి : ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా 16వ విడత సామాజిక తనిఖీలు ప్రారంభమయ్యాయని ఇన్‌చార్జి ఎంపీడీవో, పీవో పి.సీతారామయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ బృందం సభ్యులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో మాట్లాడుతూ తనిఖీ ఎలా చేయాలనే విషయాలపై వివరించారు. సమీక్షలో ఏపీవోలు ఆంజనేయరాజు, లక్ష్మణరావు, పీఆర్ఏఈ అల్లాభక్షు, సామాజిక బృందం ఎస్ఆర్‌పీ రాజు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరాలు వినియోగించుకోవాలి

నాదెండ్ల: పశు యజమానులు ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా పశువైద్యాధికారి కె.కాంతారావు చెప్పారు. చందవరం గ్రామంలో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 1వ తేది నుండి 30 వతేది వరకూ గ్రామీణ పశువైద్యశాలల ఆధ్వర్యంలో శిబిరాలు జరుగుతున్నందున గేదెలు, ఆవులు, ఎద్దులు, జీవాలకు టీకాలు వేయించాలని కోరారు. పశువులకు అనారోగ్య సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే గ్రామీణ పశువైద్యశాలల్లో వైద్య పరీక్షలు చేయించుకొని వైద్యుని సలహా పాటించాలన్నారు. కార్యక్రమంలో సాతులూరు పశువైద్యాధికారి శ్రీలక్ష్మి ఉన్నారు.

చధరంగం.

పంటల సేద్యం నష్టమే



నాదెండ్లలో శనగ పంట పీకుతున్న కూలీలు

- శనగ, కందిదీ అదే దారి..
- మార్కెట్లో ధర లేక రైతులు విలవిల
- పెరిగిన సాగు ఖర్చులు
- అంతంతమాత్రంగా దిగుబడులు
- శనగను మార్క్‌ఫెడ్ ద్వారా కొనాలని కర్షకుల డిమాండ్



గణపవరంలో శనగ పంట నూర్పిడి చేస్తున్న యంత్రం

నాదెండ్ల: ఈ ఏడాది ఆహార, వాణిజ్య పంటలు రైతులకు నష్టాలను మిగులుస్తున్నాయి. అంతంతమాత్రపు దిగుబడులతోపాటు, ధరలు పలకకపోవడంతో కన్నీరు తెప్పిస్తున్నాయి. ప్రభుత్వం కనీస మద్దతు ధరలకు పంటలను కొనుగోలు చేయకపోవటంతో రైతులు సతమతమవుతున్నారు. గత డిసెంబర్‌లో ఫెంగల్ తుఫాన్ కారణంగా పత్తి పంట దెబ్బతిని భారీగా దిగుబడి తగ్గింది. మిర్చి పంట జెమిని వైరస్, ఇతర తెగుళ్ళ వల్ల దిగుబడి పడిపోయింది. దీనికితోడు గతేడాది కన్నా ఈ ఏడాది సగానికి సగం ధరలు పడిపోయాయి. పొగాకు దిగుబడి బాగానే ఉన్నా ధరలు పడిపోవటంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

ఆదుకోని శనగ, కంది సాగు

ఈ ఏడాది ప్రధాన పంటలతో పాటు శనగ, కంది సాగుల పరిస్థితీ ఆశాజనకంగా లేదు. గతేడాది 2 వేల ఎకరాల్లోనే శనగ సాగు కాగా, ఈ ఏడాది 4600 ఎకరాల్లో సాగైంది. కంది గతేడాది 300 ఎకరాల్లో సాగు కాగా, ఈ ఏడాది 420 ఎకరాల్లో సాగైంది. శనగ ధర ప్రస్తుత మార్కెట్లో క్వింటా రూ.5000–5500ల మధ్య పలుకుతోంది. గతేడాది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.5,650కు కొనుగోలు చేసి రైతులను ఆదుకుంది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ పంటలకు మద్దతు ధరలు ప్రకటించలేదు. కనీసం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామని ప్రకటన చేయకపోవటంతో రైతులు నష్టానికే బహిరంగ మార్కెట్లో అమ్ముకునే దుస్థితి నెలకొంది.

ముమ్మరంగా శనగ నూర్పిడి

పది రోజులుగా మండలంలో శనగ పంట కోసి నూర్పిడి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. డిసెంబర్‌లో సాగైన శనగ పంట ఎకరాకు 8–10 క్వింటాళ్ళ దిగుబడి వచ్చింది. జనవరిలో సాగు చేసిన పంట దిగుబడి తగ్గి కేవలం 5–6 క్వింటాళ్ళకే పరిమితమైంది. ప్రైవేటు వ్యాపారులు నాణ్యత లేదంటూ ధరలు తగ్గించేశారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన సాగు ఖర్చులు

ఎకరా శనగ సాగుకు రూ.40 వేల పైచిలుకు ఖర్చయినట్లు రైతులు పేర్కొంటున్నారు. కౌలు రూ.12 వేలు, విత్తనాలు, పురుగుమందులు, కాంప్లెక్స్ ఎరువులు రూ.20 వేలు, కోత, నూర్పిడికి రూ.7 వేలు చొప్పున ఖర్చవుతుంది. డిసెంబర్‌లో సాగు చేసిన శనగ కొంత మేర ఊరటనిచ్చినా, జనవరిలో సాగు చేసిన రైతులకు నష్టాలు తప్పలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పెట్టుబడి భారీగా పెరిగింది



మూడెకరాల్లో శనగ సాగు చేశా. కౌలుతో కలిపి సాగు ఖర్చు రూ.లక్షపైనే అయింది. మూడెకరాల్లో 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. డిసెంబర్‌లో సాగు చేయటంతో దిగుబడి బాగుంది. మార్కెట్లో ప్రస్తుతం క్వాలిటీని బట్టి ప్రైవేటు వ్యాపారులు రూ.5500కు మించి కొనటం లేదు. ఈ ధర గిట్టుబాటు కాదు.

– జంపని సురేష్, శనగ రైతు, గణపవరం

మార్క్‌ఫెడ్ ద్వారా కొనాలి



ఈ ఏడాది ఆరెకరాల్లో శనగ సాగు చేశా. 50 క్వింటాళ్లకుపైగా దిగుబడి వచ్చింది. ఎకరాకు సాగు ఖర్చు రూ.40 వేలు అయింది. గతేడాది మార్క్‌ఫెడ్ ద్వారా రూ.5650కు ప్రభుత్వం కొనుగోలు చేసింది. ప్రభుత్వం కొనుగోలు చేస్తేనే రైతుకు గిట్టుబాటు ధర లభించి రైతులకు లాభం కలుగుతుంది.

– బొప్పూడి రామారావు, శనగ రైతు, గణపవరం

ఏపీ గురుకుల బాలుర పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

చిలకలూరిపేటటౌన్: రాజాపేట గ్రామంలోని ఏపీ గురుకుల బాలుర పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతి ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాలకు 80 సీట్లు, అలాగే ఆరు ఏడు ఎనిమిది తరగతులలో మిగిలి ఉన్న ఖాళీలకు సంబంధించి ప్రవేశాలకు కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోగా తమ వెబ్సైట్ https:/aprs.apcfss.in ద్వారా ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 25వ తేదీన పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రత్నబాబు



మతుకుమల్లిలో పైప్‌లైన్ లీకవుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

శావల్యాపురం: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.రత్నబాబు చెప్పారు. శనివారం మతుకుమల్లి గ్రామంలో మంచినీటి చెరువును పరిశీలించారు. ఏఈ మాట్లాడుతూ కలెక్టరు ఆదేశాలు మేరకు మండలంలోని 15 గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ నిధులతో చర్యలు తీసుకున్నామన్నారు. మండలంలో 450 చేతి పంపులు ఉన్నాయని మరమ్మతులు గుర్తైతే సత్వరమే చేయిస్తామన్నారు. మతుకుమల్లి గ్రామంలోని ఉన్న మంచినీటి చెరువులో నీరు రంగుమారి దుర్వాసన వస్తుండటంతో మంచి నీటి చెరువులో నీటిని బయటకు పంపి మరలా సాగర్ జలాలతో నింపుతామన్నారు. చెరువు నుంచి గ్రామంలోకి వచ్చే పైపులైను లీకేజీ, ఫిల్టర్ బెడ్స్ మరమ్మతులు చేస్తామన్నారు. పది రోజల వ్యవధిలో పనులన్నీ పూర్తిచేస్తామని చెప్పారు. పరిశీలనలో ఆయనతో పాటు మాజీ సర్పంచ్ ముంద్రు హనుమంతరావు, పంచాయతీ కార్యదర్శి బాలపరమేశ్వరరావు, సచివాలయ ఇంజినీరు బసవరాజు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి



సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో లక్ష్మణరావు

శావల్యాపురం: గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని డీఎల్‌పీవో వి.వి.ఎం.లక్ష్మణరావు చెప్పారు. శనివారం మండలంలోని మతుకుమల్లి, బొందిలిపాలెం గ్రామాల్లోని సంపద కేంద్రాలను ఆయన సందర్శించారు. డీఎల్‌పీవో లక్ష్మణరావు మాట్లాడుతూ సిబ్బందికి సూచనలుచేశారు.

కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముంద్రు హనుమంతరావు, ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, పంచాయతీ కార్యదర్శి బాలపరమేశ్వరరావు, సచివాలయ ఇంజినీరు రంతు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



శావల్యాపురం: శావల్యాపురం ఎస్సీ కాలనీలో జిల్లా డీఆర్డీఏ ఇన్‌చార్జ్ ప్రాజెక్టు డైరెక్టరు హీరాలాల్ ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లు పంపిణీని శనివారం నిర్వహించారు. హీరాలాల్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాలను అర్హత కలిగి ఉన్న లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం లబ్ధిదారుడుతో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు ఏపీఎం జి.వాసుబాబు, సీసీ ఖాజావలీ, మహిళా పోలీసు గౌసియాబేగం పాల్గొన్నారు.

ననాదెండ్ల మండలంలో..

నాదెండ్ల: మండలంలోని 16 సచివాలయాల్లో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ శనివారం ప్రారంభమైంది. సాతులూరు గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీని పల్నాడు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ హీరాలాల్‌నాయక్ పరిశీలించారు. మండల పరిధిలో 9,379 మంది పెన్షనర్లకు గాను రూ.4,00,77,500లు పంపిణీ చేయాల్సి ఉండగా, తొలిరోజు 95 శాతం పైగా లబ్దిదారులకు పింఛన్లు అందించారు. ఆయనతో పాటూ ఎంపీడీవో స్వరూపరాణి, ఏపీఎం రమేష్, పంచాయతీ కార్యదర్శులు రాఘవయ్య, మధుసూదనరావు, సీసీ సాంబశివరావు, వీఆర్వో వీరయ్య పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



చిలకలూరిపేట జ్ఞానేశ్వరి సొసైటీ ఆధ్వర్యంలో విద్యాసామాగ్రి పంపిణీ చేస్తున్న సభ్యులు

నాదెండ్ల: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలని ప్రభుత్వ నోటరీ, మాజీ ఏజీపీ దాసరి చిట్టిబాబు చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం చిలకలూరిపేట జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న 50 మంది విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ చేశారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైంటిఫిక్ టెంపర్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ నెల 17న పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో స్పెషల్ ఆఫీసర్ మాధవీలత చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు గేరా యాకోబు, సభ్యులు బాజి, చంద్రం, బుల్లిబాబు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి



ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్షలో డీఆర్‌డీఏ పీడీ హీరాలాల్ సామారియా

నకరికల్లు: వేసవి కాలం దృష్ట్యా మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ హీరాలాల్ సామారియా ఆదేశించారు. నకరికల్లులో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. పలువురు లబ్ధిదారులకు పింఛన్‌ను స్వయంగా అందజేశారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీరాజ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి ఎద్దడి ఉండే గ్రామాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఏ గ్రామంలోను తాగునీటి సమస్య రాకూడదన్నారు. ముందుగా గ్రామాల్లో పర్యటించి బోర్లు, రక్షిత మంచి నీటి కొళాయిలు పరిశీలించాలని, మరమ్మతులకు గురైన చోట వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ సురేష్, సీసీ కనకారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా కాశయ్య బాధ్యతల స్వీకరణ

ముప్పాళ్ళ: ముప్పాళ్ళ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా నకరికల్లు ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న జి.కాశయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన పీజే విలియమ్స్ శుక్రవారం పదవీ విరమణ కావటంతో ఉన్నతాధికారులు నకరికల్లు ఎంపీడీవోకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆ మేర కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈఓపీఆర్డీ రూపవతి, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది ఇన్‌చార్జ్ ఎంపీడీవోను పుష్ప గుచ్ఛం అందించి సన్మానించారు.

ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం



వినుకొండలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

నాదెండ్ల/వినుకొండ/నూజెండ్ల : గణపవరం చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాలలో శనివారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు శనివారం తెలుగు, సంస్కృతం, ఉర్దూ పరీక్షలు జరిగాయి. 565 విద్యార్థులకు గాను 550 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 8 గంటలకే విద్యార్థులు కళాశాల వద్దకు చేరుకున్నారు. 8.30 గంటలకు పరీక్షా గదుల్లోకి అనుమతించారు. 9 గంటల నుండి 12 గంటల వరకూ పరీక్ష జరిగింది. ఈ నెల 15 వరకూ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా చిరుమామిళ్ళ ఏపీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు ఏవీ శ్రీవత్స, డీవోగా రేణుకాదేవి, కోఆర్డినేటర్‌గా ప్రిన్సిపల్ ఎం శ్రీనివాసరావు వ్యవహరించారు.

- వినుకొండలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, విశ్వసాయి జూనియర్ కళాశాల, మండలంలోని చీకటీగలపాలెం మోడల్ స్కూల్, నూజెండ్ల మండలం ఉప్పలపాడులోని బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్ట భద్రతా చర్యలు తీసుకున్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లు, ఒక మహిళా కానిస్టేబుల్‌ను నియమించారు. సీసీ కెమెరాల ద్వారా పరీక్ష కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారు.
- నూజెండ్ల మండలంలోని ఉప్పలపాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శనివారం నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.రమణమ్మ మాట్లాడుతూ పాఠశాలలో 436 మందికి గాను 416 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు. వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్‌రావు సారథ్యంలో ఐనవోలు ఎస్ఐ కృష్ణారావు తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

స్నేహ హస్తాలు సౌజన్యంతో పాఠశాలకు ఫెన్సింగ్



ఫెన్సింగ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో గణేష్

అచ్చంపేట: మండలంలోని నీలేశ్వరపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి పశువులు, అసాంఘిక శక్తులు ప్రవేశించకుండా ఉండేందుకు స్నేహ హస్తాలు ఫౌండేషన్, గ్రామస్తుల సంయుక్త సహకారంతో పాఠశాల చుట్టూ నిర్మించిన ఫెన్సింగ్‌ను ఎంఈవో మాచవరపు గణేశ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో పశువులు ప్రవేశించడంతో ఆవరణ మొత్తం అపరిశుభ్రంగా ఉండటం వల్ల విద్యార్థులు చదువుపై ఏకాగ్రత పెట్టలేని పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చేదన్నారు. విషయం తెలుసుకున్న స్నేహ హస్తాలు ఫౌండేషన్, గ్రామస్తులు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని ముందుకు రావడం అభినందనీయమన్నారు. దీనికి మొత్తం రూ.1.20 లక్షలు ఖర్చు కాగా, రూ.60 వేలు స్నేహ హస్తాలు, రూ.60 వేలు గ్రామస్తులు భరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అచ్చంపేట స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ చిగురుపాటి కళ్యాణి, సర్పంచ్ రామావతు కోటేశ్వరనాయక్, ఎస్ఎంసీ చైర్మన్ కొట్టె నరేష్, హెచ్‌ఎం నంద్యాల శివకుమారి, స్నేహ హస్తాలు కో ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, సభ్యులు తుమ్మా శౌర్రెడ్డి, ఉపాధ్యాయులు బత్తుల సాంబశివరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కనుల పండువగా సత్తెమ్మతల్లి, సత్యదేవుల కల్యాణం



సత్తెమ్మతల్లికి చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

అచ్చంపేట: మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోని అడవిలో స్వయంభు సత్తెమ్మతల్లి, సత్యదేవుల కల్యాణ మహోత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రీలక్ష్మీ గణపతి హోమం, చండీ హోమం నిర్వహించారు. గత 41 రోజులుగా అమ్మవారి దీక్ష చేపట్టిన భక్తులు మాల విరమణ కార్యక్రమన్ని చేపట్టారు. యర్రంశెట్టి శ్రీనివాసరావు, సత్యవతి దంపతులు 108 మట్టి కలశాలతో సత్తెమ్మతల్లి, సత్యదేవుల ఉత్సవ మూర్తులకు పాలాభిషేకం చేశారు. మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మహోత్సవాన్ని యర్రంశెట్టి శ్రీనివాసరావు దంపతులచే మేడేపల్లి అప్పయ్యశాస్త్రి శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులు భజన కార్యక్రమాలు, కోలాట ప్రదర్శనలు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సత్తెమ్మతల్లి, సత్యదేవుల కల్యాణాన్ని తిలకించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్‌తో ఒరిగేదేం లేదు

ఏపీ రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలరావు



నరసరావుపేట: రాష్ట ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ బడ్జెట్‌తో రైతులకు ఒరిగేదేం లేదని ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు విమర్శించారు. శనివారం మీడియాతో గోపాలరావు మాట్లాడుతూ ప్రస్తుతం మిర్చి రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఆవేదనకు గురవుతుంటే, వారికి భరోసా కల్పించేలా ఎటువంటి చర్యలూ తీసుకోలేదని ధ్వజమెత్తారు. ధరల స్థిరీకరణ పథకం ద్వారా రాష్ట ప్రభుత్వం క్వింటాల్ మిర్చిని కనీసం రూ.20వేలకు తగ్గకుండా కొనుగోలు చేసి రైతును ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనగ, కంది రైతులు కూడా సరైన ధర లేక దిగాలు పడ్డారని, వీరిని ఆదుకునే దిశగా బడ్జెట్‌లో కేటాయింపులు లేవని, రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని గోపాలరావు పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు అన్నదాత సుఖీభవ ద్వారా రాష్ట ప్రభుత్వం మాత్రమే రూ.20వేలు ఇస్తుందని చెప్పిన పాలకులు నేడు కేంద్రంతో కలిపి రూ.20 వేలు చెల్లిస్తామనటం రైతులను దగా చేయటమేనని ధ్వజమెత్తారు. పల్నాడు వరప్రదాయిని వరికెపుడిశెల ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు.

గాలికుంటు టీకా కార్యక్రమం



నూజెండ్ల: మండలంలోని పుచ్చనూతల గ్రామంలో గాలికుంటు టీకా కార్యక్రమం శనివారం ప్రారంభించినట్లు పశువైద్యాధికారి శివాజీ తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మండలంలోని 27 గ్రామపంచాయతీల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాను ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. గాలికుంటు సోకిన పాడిగేదెల్లో పాల ఉత్పత్తి పూర్తిస్థాయిలో తగ్గుతుందని పేర్కొన్నారు. ఈనెల 31 వరకు అన్ని గ్రామాల్లో టీకా కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు.

పశువులకు గాలికుంటు టీకా

శావల్యాపురం: వేల్పూరు గ్రామంలో గాలి కుంటు టీకా కార్యక్రమం శనివారం ప్రారంభించినట్లు పశువైద్యాధికారి పాలపర్తి గణేష్‌కుమార్ తెలిపారు. ఈనెల 31 వరకు అన్నీ గ్రామాల్లోని పశువులకు గాలి కుంటు టీకాలు ఉచితంగా వేస్తామన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

యడ్లపాడు: బోయపాలెం గ్రామంలోని శ్రీ అనంతలక్ష్మి నూలుమిల్లు ఆవరణలో ఆదివారం ఉచిత కంటివైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు మిల్లు ఎండీ సామినేని కోటేశ్వరరావు తెలిపారు. మిల్లులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ తండ్రి స్వర్గీయ సామినేని పానయ్య స్మారకార్థంగా సామినేని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దశాబ్దన్నర కాలంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా వైద్య శిబిరం ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందని వెల్లడించారు. శంకర్ కంటివైద్యశాల వైద్యులు ఉచితంగా పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయడంతోపాటు ఉచితంగా మందులు అందజేస్తారని వెల్లడించారు. శిబిరాన్ని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎస్.శ్రీనివాస్ కుమార్, యాక్సిస్ బ్యాంక్ ఏపీ సర్కిల్ హెడ్ షేక్ రియాజు, విజయవాడ సెంటర్ హెడ్ పి.కోటేశ్వరరావు, రిలేషన్‌షిప్ మేనేజర్ ఆర్. లీలాకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం వైద్యశిబిరం కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో మిల్లు ఈడీ సామినేని ఫణికుమార్, మేనేజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం



గోళ్ళపాడు (ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో వేంచేసి యున్న ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా హనుమాన్ చాలీసా పారాయణం శనివారం నిర్వహించారు. ఆలయంలో తెల్లవారుజామున జరిగిన ఈ కార్యక్రమంలో హనుమద్దీక్షాపరులు పాల్గొని 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.